క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిట్యాల: విద్యుత్ మరమ్మతులు కారణంగా చిట్యాల మండలంలోని ఆరెగూడెం, పెద్దకాపర్తి, చిన్నకాపర్తి గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చిట్యాల ట్రాన్స్‌కో ఏఈ రవీందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

19న మండల మహాసభ

కట్టంగూర్ : మండలంలోని ఇస్మాయిల్‌పల్లి గ్రామంలో ఈ నెల 19న జరిగే సీపీఎం మండల మహాసభను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు కోరారు. ఆదివారం కట్టంగూర్ మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో మాద సైదులు, పెంజర్ల కృష్ణ, జాల ఆంజనేయులు, చిలుకూరి సైదులు, ప్రవీణ్, గోపిరెడ్డి, సందీప్‌రెడ్డి, మాద శ్రీను, బొడ్డుపల్లి నర్సింహ పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న భక్తులు

నల్లగొండ క్రైం: పట్టణంలోని బ్రహ్మంగారి గుట్టపై కనకదుర్గమ్మ గుడి వద్ద భక్తులు కట్టిన ముడుపులను కొందరు వ్యక్తులు తొలగించి దహనం చేశారు. దీంతో నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, హైందవ ధర్మాన్ని కాపాడాలని కోరుతూ భక్తులు రామకృష్ణ, నర్సింహారెడ్డి, సైదులు, మురళి, కుమార్, గోపాల్ ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శివస్వాములు

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో గల శ్రీపార్వతిశంభులింగేశ్వర ఆలయంలో ఈ నెల 25న నిర్వహించనున్న శివ మహాపడి పూజ కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం ఆలయ ప్రాంగణంలో భక్తులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో హాజరై మహాపడిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహాపడిపూజ నిర్వాహకుడు భూపతి ఉపేందర్, ఆలయ ధర్మకర్త వావిలాల రామలింగయ్యశర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నార్కట్‌పల్లి : నగదు అందజేస్తున్న మాజీ సర్పంచ్ స్వామి

నార్కట్‌పల్లి : మండలంలోని శాపల్లి గ్రామానికి చెందిన పల్లి శాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈమేరకు గ్రామ మాజీ సర్పంచ్ సిద్దగోని స్వామి ఆదివారం శాంతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయనవెంట జాల ముకుందం, మాగి యాదయ్య, నాగరాజు, నర్సింహ, రమేష్, రామచంద్రు తదితరులు ఉన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రాచకొండ యాదయ్య శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. కాగా యాదయ్య డ్రైవర్ కావడంతో యజమాని దేవులపల్లి నరేందర్‌రెడ్డి పంపిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని తోటి డ్రైవర్లు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అందజేశారు. పారంద రమేష్, దేవరాం, వేనేపల్లి శ్రీపతిరావు, పల్లె వెంకటయ్య, పోలెపల్లి శ్రీరాములు, ప్రభుదాస్, బాలకృష్ణ, రవీందర్‌లు ఉన్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం

మునుగోడు: నియోజకవర్గ కేంద్రమైన మునుగోడు పట్టణంలోని ఏ వీధిలో చూసినా శునకాలు గుంపులుగా సంచరిస్తున్నాయి. సాయంత్రం సమయంలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లేందుకు గ్రామ ప్రజలు భయపడుతున్నారు. చిన్నారుల వద్ద ఏదైనా వస్తువులు కనిపిస్తే వాటిని లాక్కునేందుకు కుక్కలు ఎగబడుతున్నాయి. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శి చర్యలు తీసుకుని గ్రామంలో శునకాల బెడద తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మునుగోడు ప్రధాన కూడలిలో గుంపులుగా తిరుగుతున్న శునకాలు

నిబంధనలు బేఖాతరు !



ఎలికట్టె-బ్రాహ్మణవెల్లెంల గ్రామాల మధ్య నిర్మిస్తున్న రోడ్డు



ధ్వంసమైన కల్వర్టును చూపుతున్న స్థానికులు

- నాణ్యతాలోపంతో రోడ్డు నిర్మాణం
- ధ్వంసమైన కల్వర్టులు తిరిగి నిర్మించకుండానే రోడ్డు పనులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

చిట్యాల: మండలంలోని ఎలికట్టె నుంచి నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెంల గ్రామం వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనుల్లో నిబంధనలు పాటించడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్ నాణ్యతాలోపంతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల గ్రామం నుంచి చిట్యాల మండలం ఎలికట్టె గ్రామం వయా వెంబాయి, బోయగుబ్బ గ్రామాల వరకు బీటీ రోడ్డు మంజూరయింది. కాగా ఈ రోడ్డు పనుల్లో నాణ్యతాలోపంతోపాటు అవసరమైన చోట రోడ్డు వెంట కల్వర్టుల నిర్మాణాలను చేపట్టడం లేదు.

అధికారులకు ఫిర్యాదు చేసినా..

బ్రాహ్మణవెల్లెంల గ్రామం నుంచి ఎలికట్టె గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. ఈ రోడ్డు మార్గంలో పలుచోట్ల గతంలో ఉన్న కల్వర్టులు ధ్వంసమయ్యాయి. అయితే నూతనంగా బీటీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నందున ధ్వంసమైన చోట తిరిగి కల్వర్టులను నిర్మించాల్సి ఉన్నప్పటికీ కల్వర్టులు నిర్మించకుండా కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నాడు. కల్వర్టులను నిర్మించకపోవడంతో వర్షపు నీరు కల్వర్టుల వద్దనే నిలిచిపోతోంది. ఈ విషయమై ఎలికట్టె గ్రామానికి చెందిన పలువురు నాయకులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. అధికారులు కనీసం రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు బీటీ రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించి అవసరమైన చోట కల్వర్టుల నిర్మాణాలు చేపట్టాలని, రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎలికట్టె గ్రామస్తులు కోరుతున్నారు. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై ఆర్‌అండ్‌బీ ఏఈ వివరణ కోరేందుకుగాను ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. అయితే బీటీ రోడ్డు పనులు జరుగుతున్న బ్రాహ్మణవెల్లెంల గ్రామం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సొంత గ్రామం కావడం విశేషం.



రోడ్డును పరిశీలిస్తున్న స్థానికులు

కల్వర్టులు నిర్మించాలి



బ్రాహ్మణవెల్లెంల నుంచి ఎలికట్టె గ్రామం వరకు చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించడం లేదు. గతంలో ఈ రోడ్డు వెంట ఉన్న కల్వర్టులు ధ్వంసమయ్యాయి. ధ్వంసమైన కల్వర్టులను తిరిగి నిర్మించకుండానే కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నాడు. కల్వర్టులు నిర్మించకపోవడంతో వర్షం వచ్చినప్పుడు రోడ్డు పక్కన నీళ్లు నిలుస్తున్నాయి. అధికారులు తగిన చర్యలు తీసుకుని రోడ్డుపై అవసరమైన చోట కల్వర్టులు నిర్మించడంతోపాటు నాణ్యత ప్రమాణాలతో రోడ్డు నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

–ఇస్కిళ్ల నాగరాజు, ఎలికట్టె

పనుల్లో నాణ్యత పాటించాలి

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చండూరు : పట్టణంలో చేపడుతున్న సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చండూరు మున్సిపల్ పరిధిలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వర్షపు నీరు, డ్రెయినేజీ నీరు సజావుగా వెళ్లేలా నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీకి సంబంధించి మాస్టర్‌ప్లాన్ తయారు చేయించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. చేనేత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. అనంతరం మున్సిపల్ కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించారు. అదేవిధంగా మండల పరిధిలోని చొప్పరివారిగూడెంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. చామలపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కొరిమి ఓంకారం, కోడి శ్రీనివాస్, నల్లగంటి మల్లేశం, కొన్‌రెడ్డి యాదయ్య, అనంత చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చండూరులో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి



మాట్లాడుతున్న రాంబాబు

మునుగోడు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో దివ్యాంగుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం మునుగోడులో నిర్వహించిన మునుగోడు నియోజకవర్గ దివ్యాంగుల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దివ్యాంగులకు నెలకు రూ.6వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 11 నెలలు గడిచినా హామీ అమలు చేయకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ ఈ నెల 18 నుంచి 23 వరకు అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. అదేవిధంగా ఈ నెల 25న చలో హైదరాబాద్ చేపట్టి ఇందిరా పార్క్ వద్ద వికలాంగుల ఆవేదన సభ నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీనివాసులు, జిల్లా కన్వీనర్ హరికుమార్, కో కన్వీనర్లు వీరబోయిన సైదులు, చిలుముల జలంధర్, దొంతగోని మహేష్, దొమ్మాటి సత్యనారాయణ, యసరాని మంగళమ్మ, శివరాత్రి సైదమ్మ, ఈద పరమేష్ పాల్గొన్నారు.

సీఎంకు పేరొస్తుందనే అడ్డుకునే యత్నం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : మూసీ ప్రక్షాళన చేస్తే సీఎం రేవంత్‌రెడ్డికి పేరు వస్తుందని ప్రతిపక్షాలు అడుకునే ప్రయత్నం చేస్తున్నాయని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళన చేయట్లేదా.. అక్కడ ఇళ్లు కూల్చడం లేదా అన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. బీజేపీ చేసేది మూసీ నిద్ర కాదు తీర్థయాత్రలు చేస్తున్నట్లు ఉందన్నారు. మూసీ పక్కనే పడుకోకుండా ఎక్కడో నిద్ర చేసి మూసీ నిద్ర అంటున్నారని విమర్శించారు. మూసీ నిద్ర చేసిన వాళ్లు మూసీ నీళ్లతోనే ముఖం కడుక్కోవాలి, స్నానం చేయాలన్నారు. ప్రక్షాళన చేస్తే ప్రతిపక్షాలకు వచ్చిన నష్టం ఏంటో చెప్పాలన్నారు. మూసీ ప్రక్షాళనతో రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు లాభం చేకూరుతుందన్నారు. రైతులు మంచి నీళ్లు వస్తాయని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, లింగాల వెంకన్న, చొగోని శ్రీనివాస్‌గౌడ్, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలి

కట్టంగూర్ : గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి వీరస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కట్టంగూర్ మండలంలోని ముత్యాలమ్మగూడెం జీపీ పరిధి చిన్నపురి గ్రామంలో గల మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను మానవ హక్కుల వేదిక ప్రతినిధులు సందర్శించారు. పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనం వివరాలు, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ దుప్పట్లు, బెడ్లు, ఏర్పాటు చేయలేదన్నారు. ప్రహరీ లేక రాత్రి పూట విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అద్దంకి దశరథ, జిల్లా ఉపాధ్యక్షుడు చింతమల్ల గురువయ్య, జిల్లా సహాయ కార్యదర్శి చెట్టిపల్లి కాన్షీరాం, గడ్డం వెంకటరమణ, మహమ్మద్ ఫయాజ్ పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న మానవ హక్కుల వేదిక ప్రతినిధులు

అంజన్‌రావు సేవలు మరువలేనివి



అంజన్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు

మర్రిగూడ : పానుగోటి అంజన్‌రావు సమాజానికి చేసిన సేవలు మరువలేనివని సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మర్రిగూడకు చెందిన అంజన్‌రావు దశదిన కర్మ సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు ఉజ్జిని రత్నాకర్‌రావు, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, మాజీ వైస్ ఎంపీపీ పానుగోటి విజయరామారావు, మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి, బూడిద సురేష్, బుర్ర శేఖర్, చెల్లం పాండురంగారావు, ఆకుల రఘుమయ్య, ఎరుకల యాదయ్య, నిరంజన్, కూన్‌రెడ్డి గిరి, కల్లెం యాదిరెడ్డి తదితరులు ఉన్నారు.

అంజన్‌రావుకు నివాళి

బీఆర్‌ఎస్ నాయకుడు పానుగోటి దేశ్‌ముఖ్ తండ్రి పానుగోటి అంజన్‌రావు దశదినకర్మ ఆదివారం మర్రిగూడ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్లుగీత కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ హాజరై అంజన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట రాష్ట్ర చిల్డ్రన్స్ కమిషన్ సభ్యుడు పానుగోటి అంజన్‌రావు, మాజీ ఎంపీపీ అనంతరాజుగౌడ్, మాజీ సర్పంచ్‌లు నల్ల యాదయ్యగౌడ్, చెరుకు లింగంగౌడ్, అయిలి నరసింహగౌడ్, పందుల రాములు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక దామోదర పూజలు



దీపాల అలంకరణలో శ్రీకృష్ణుడి విగ్రహం

చిట్యాల: తాళ్లవెల్లెంల గ్రామంలో గల ఆర్గానిక్ శ్రీకృష్ణ మందిరంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం కార్తీక దామోదర పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చనలు, భజనలు చేశారు. గర్భగుడిలో శ్రీకృష్ణుడి విగ్రహం ఎదుట దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కార్తీక వన భోజనాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు పామనగుళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫార్మా విజన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా శివ

మిర్యాలగూడ టౌన్ : ఫార్మా విజన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా మిర్యాలగూడ పట్టణానికి చెందిన గొట్టిపర్తి శివను నియమిస్తూ ఏబీవీపీ జిల్లా విభాగ్ ప్రముఖ్ కత్తుల ప్రమోద్ నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈనెల 15, 16వ తేదిల లో సూర్యాపేటలోని వికాస్ ఫార్మసీ కళాశాలలో ఏబీవీపీ విద్యార్థులకు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపులో ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా గొట్టిపర్తి శివ మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫార్మసీ కళాశాలలో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై ఉన్న నమ్మకంతో రాష్ట్ర, జిల్లా ఏబీవీపీ నాయకత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫార్మా విజన్ కన్వీనర్‌గా నియమించడంతో మరింత బాధ్యత పెరిగిందని, ఏబీవీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియమకానికి సహకరించిన ఏబీవీపీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

అసంపూర్తిగా మడిగెల నిర్మాణం !

- ఏడాదిన్నర క్రితం శంకుస్థాపన
- ఇప్పటికే ముగిసిన గడువు
- పనులు పూర్తయితే చిట్యాల మార్కెట్ యార్డుకు అదనపు ఆదాయం



చిట్యాలలో అసంపూర్తిగా ఉన్న వ్యవసాయ మార్కెట్ దుకాణ సముదాయం

చిట్యాల: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయ వనరులను పెంచుకునేందుకు ఏడాదిన్నర క్రితం భువనగిరి రోడ్డులోని మార్కెట్ స్థలంలో దుకాణాలు(మడిగెలు) నిర్మించాలని ప్రభుత్వం భావించింది. చిట్యాల వ్యవసాయ మార్కెట్ నిధులు కోటి పదహారు లక్షల రూపాయలతో ముప్పయి ఒక్క దుకాణాలు నిర్మించేందుకు టెండర్లను పిలిచి ఏడాదిన్నర క్రితం శంకుస్థాపన చేశారు. అయితే టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆలస్యంగా మడిగెల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఏడాది క్రితం పనులు ప్రారంభించి నేటి వరకు పూర్తి చేయలేదు.

రెండు అంతస్తుల్లో నిర్మాణం..

చిట్యాల మార్కెట్ యార్డు స్థలంలో రెండు అంతస్తుల్లో చేపట్టిన దుకాణాల నిర్మాణాలు పూర్తికాగా కింద వరుసలోని మడిగెలకు షట్టర్లు బిగించారు. పై అంతస్తులోని మడిగెలకు షట్టర్‌లు బిగించి, విద్యుత్ సదుపాయం కల్పిస్తే దుకాణాలు అందుబాటులోకి వచ్చి మార్కెట్‌కు ఆదాయం పెరుగుతుంది. కానీ కొద్దిపాటి పనులను అసంపూర్తిగా నిలిపివేయడంతో మార్కెట్‌కు రావాల్సిన ఆదాయం రాకుండా పోతోంది. మార్కెట్ అధికారులు కూడా పనులు పూర్తిచేసే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని చర్చ జరుగుతోంది. మార్కెట్ మడిగెలకు చిన్నచిన్న పనులు పూర్తికావాల్సి ఉన్నా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిర్ణీత గడువులోపు పనులు పూర్తికాకపోవడంతో చిట్యాల వ్యవసాయ మార్కెట్‌కు రావాల్సిన ఆదాయం రాకుండా పోతోంది. సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుని దుకాణ సముదాయాలను పూర్తి చేయించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

భవనాలను వెంటనే పూర్తి చేయాలి



వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న దుకాణ సముదాయం పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. నిర్ణీత గడువు లోగా నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో మార్కెట్‌కు రావాల్సి ఆదాయం రాకుండా పోయింది. సంబంధిత కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకుని దుకాణ సముదాయ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయించి ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఐతరాజు నర్సింహ, రైతు సంఘం మండల కార్యదర్శి, చిట్యాల

గడువు ముగిసింది

వ్యవసాయ మార్కెట్‌కు సంబంధించి 31 మడిగెల నిర్మాణాలకుగాను నిర్ణీత గడువు ఇప్పటికే ముగిసింది. సంబంధిత కాంట్రాక్టర్ నెమ్మదిగా పనులు చేపడుతుండడంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టి త్వరగా పూర్తి చేసేందుకుగాను తగిన చర్యలు తీసుకుంటాం.

– జానయ్య, చిట్యాల ఏఎంసీ కార్యదర్శి

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



భక్తి ప్రవచనాలు వినిపిస్తున్న శ్రీధర్ స్వామీజీ

నకిరేకల్ : ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా ముక్కాముల పీఠాధిపతి శ్రీ శ్రీధర్ స్వామీజీ అన్నారు. నకిరేకల్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయంలో దేవతా విగ్రహం, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా ఆదివారం వాస్తు, మూల మంత్ర హోమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన పాల్గొని భక్తి ప్రవచనాలు వినిపించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు గర్రె రామూర్తి, బ్రహ్మదేవర విశ్వనాథం, లక్ష్మయ్య, పద్మాకృష్ణమూర్తి, గర్రె వెంకన్న, శ్రీనివాస్, వీర్లపాటి రాంబాబు, లక్ష్మీరాంబాబు, నర్సింహారావు, వీర్లపాటి కృష్ణ, వీర్లపాటి లక్ష్మణ్, వేంకటేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ వీర్లపాటి జానయ్య, ఆర్యవైశ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం

నార్కట్‌పల్లి : మండలంలోని గోపలాయపల్లి గ్రామ సమీపాన గల శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం రోహిణి నక్షత్రం పురస్కరించుకుని ఆలయ అర్చకులు వేద మంత్రాలతో సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, రాజేశ్వరిదేవి, ఈఓ అంబటి నాగిరెడ్డి, దోసపాటి విష్ణు, రమేష్, భాస్కర్‌చారి, వేణు మనోహర్‌రెడ్డి, ఉమ, దేవేందర్‌రెడ్డి సుజాత, శ్రీశైలం మమత, నవీన్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సర్వేకు సహకరించండి



సర్వేను పరిశీలిస్తున్న దైద రవీందర్

నకిరేకల్ : ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని టీపీసీసీ నేత దైద రవీందర్ అన్నారు. నకిరేకల్ పట్టణంలోని తాటికల్ రోడ్డులో సర్వేను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గార్లపాటి కృష్ణారెడ్డి, వంటిపాక నక్షత్, చెనగాని రాజశేఖర్, నల్గొండ మహేష్, దైద సురేష్ ఉన్నారు.

చెట్ల నీడే సమావేశపు గది !

మునుగోడు: పేరుకు నియోజకవర్గ కేంద్రమైనా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పెద్ద ఆస్పత్రి లేదు. ఆస్పత్రిలో వైద్యాధికారులు కూర్చుని రోగులను పరీక్షించేందుకు, ల్యాబ్‌తోపాటు నలుగురు, ఐదుగురికి చికిత్స చేసేందుకు అవసరమైన గదులు తప్ప అదనంగా లేవు. సిబ్బంది సమావేశాలు నిర్వహించినప్పుడు, కూర్చునేందుకు సమావేశ మందిరం లేదు. ఎప్పుడు సమావేశం నిర్వహించినా ఆస్పత్రి ఎదురుగా ఉన్న చెట్ల కిందనే సమావేశాలు నిర్వహించాల్సి వస్తోంది. ప్రధానంగా ఆశా కార్యకర్తలకు, ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇవ్వాల్సి వచ్చినప్పుడు, సమీక్ష సమావేశాలు నిర్వహించాల్సి వచ్చినప్పుడు చెట్ల నీడే సమావేశ వేదికగా మారింది. సమావేశం నిర్వహించాల్సిన సమయంలో వర్షం కురిస్తే ఇక అంతే సంగతులు.. ఆ రోజు సమావేశాన్ని వాయిదా వేసుకోవాల్సి వస్తోంది. అంతేకాకుండా మునుగోడు సబ్ సెంటర్‌కు భవనం లేకపోవడంతో ఆ సబ్ సెంటర్ ఏఎన్‌ఎంలు చెట్ల నీడలోనే ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆస్పత్రిలో ప్రత్యేక సమావేశ గది నిర్మించాలని సిబ్బంది, మండల ప్రజలు కోరుతున్నారు.



మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో చెట్ల కింద సమావేశం నిర్వహిస్తున్న వైద్యాధికారులు